క్లుప్తంగా

ఎండలకు రోడ్లు నిర్మానుష్యం


నిర్మానుష్యంగా మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక : కొద్ది రోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మార్చి నెలాఖరులోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే మాసాల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళనకు గురవుతున్నారు. శనివారం మధ్యాహ్నం 12 గంటలకే ప్రజలు ఇళ్లకు చేరుకునే పరిస్థితులు కనిపించాయి. ఎండ పెరిగిపోవడంతో మునగపాక మెయిన్‌రోడ్డు నిర్మానుష్యంగా మారింది. రైతులు తమ వ్యవసాయ పనులు వేగంగా ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి


గణపర్తిలో పల్లె నిద్ర చేస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు

మునగపాక : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ పి.ప్రసాదరావు కోరారు. మండలంలోని గణపర్తిలో శుక్రవారం రాత్రి ఆయన పల్లె నిద్ర నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి వివాదాల జోలికి పోకుండా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో గుంపులుగా తిరగరాదని, కవ్వింపు చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. ఎన్నికల నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిందేనన్నారు. కోడ్‌కు విరుద్ధంగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు గ్రామాల్లో పల్లె నిద్ర చేపడుతున్నామని ప్రసాదరావు తెలిపారు.

10న భద్రావతి సమేత భావనారుషి కల్యాణం


రాట మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: మండలంలోని దుప్పుతూరులో వెలసి ఉన్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయం వద్ద రాట మహోత్సవం నిర్వహించారు. వచ్చే నెల 10న స్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమాల్లో పప్పు రాజారావు, దేశంశెట్టి శంకర్‌రావు, దేశంశెట్టి కాసుబాబు, మాడెం సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంక్షోభంపై అవగాహన అవసరం


ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం : మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం నీటి సంక్షోభం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏషియన్ పెయింట్స్ ఆర్థిక సహకారంతో అంబుజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రసాదరావు, మహేంద్ర, అనిల్, వెంకట్, రాజు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

రాంబిల్లి : ఎన్నికల ప్రవర్తన నియమావళిని అందరూ పాటించాలని ఎంపీడీవో వెంకటాచలం సూచించారు. శనివారం ఆయన వెంకటాపురం, అప్పన్నపాలెంలో పర్యటించారు. తొలుత అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం గ్రామంలో పలు బూత్‌ల పరిధిలో పర్యటించి సిబ్బందికి సూచనలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తోనే సాధ్యం


ఓటర్లకు ఫ్యాన్ గుర్తు బ్రోచర్లను అందిస్తున్న అభ్యర్థి కంబాల జోగులు


కేశవరంలో నాయకులతో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

పాయకరావుపేట : రాష్ట్రంలో రామరాజ్యం స్థాపన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, అందుకే మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డికే పట్టం గట్టాలని ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలో గల కేశవరం గ్రామంలో ఎన్నికల ప్రచారం సాగించారు. ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు గ్రామంలో నాయకులను, ఓటర్లను ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులును పరిచయం చేస్తూ, ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలు పార్టీలకు, కుల, మతాలకు, వర్గాలకు, రాజకీయాలకు అతీతంగా మంజూరు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాలు ఏర్పాటు, గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు అర్హుల ఖాతాలకు నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించడం కోసం గ్రామస్తులు మండల కేంద్రాలకు వెళ్ళకుండా గ్రామాల్లోనే దరఖాస్తులు, వినతులు సంక్షేమ పథకాలు దరఖాస్తులు చేసుకునే విధంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా వుండాలన్న లక్ష్యంతో గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ఘనత జగన్ కే దక్కిందన్నారు. ఆరోగ్యం కోసం ఆరోగ్య శ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆసుపత్రిలో 25 లక్షల రూపాయల వరకు ఖర్చు చేసి వైద్యం అందించడం జరుగుతుందన్నారు. రైతులకు రైతు భరోసా, డ్వాక్రా మహిళలకు వడ్డీ రాయితీ, చేయూత, కాపు నేస్తం, ఆసరా, అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విద్యకానుక, జగనన్న గోరుముద్ద వంటి ఎంతో ప్రతిష్టాత్మకమైన పథలు ప్రవేశ పెట్టారన్నారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి ఇంటిలోను అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకముందే సామాజిక పింఛన్ల పంపిణీ చేయిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. రాష్ట్రంలో యథా ప్రకారం సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మనందరం మరలా త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్‌సీపీని గెలిపించుకోవాలన్నారు. ఎన్ని పార్టీలు, ఎంతమంది నాయకులు ఏకమైనా సరే వైఎస్సార్‌సీపీకే ప్రజలు పట్టం గట్టాడానికి సిద్ధంగా వున్నారన్నారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ఓటర్లకు ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. గత ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో ఇచ్చిన హామీలనే ఎన్నికల మేనిఫెస్టోగా చేసుకుని 99 శాతం హామీలను నేరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఈ ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, మాజీ మండల అధ్యక్షుడు దనిశెట్టి బాబూరావు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, సర్పంచ్‌లు కోడ కోటేశ్వరరావు, గెద్దమూరి శ్రీనివాసరావు, పన్నీరు బాబ్జి, మేడిశెట్టి రామగోవిందు, గోసల రమణ, చేపల తాతాజీ, ఎంపిటిసిలు పల్లేల లక్ష్మణ్, గారా చక్రవర్తి, కొంతం నరేష్, మహేష్, మండల బీసీ, ఎస్సీ సెల్ అధ్యక్షులు పక్కుర్తి లోవ, బోడపాటి గోవిందు, పార్టీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి యజ్జల అన్నవరం, ఆయా గ్రామాల సీనియర్ నాయకులు గూటూరు వెంకటేశ్వరరావు, మేడిశెట్టి రాము, పల్లేల వెంకట్, పల్లేల కృష్ణార్జునరావు, తూము రమణ, కోనే పుత్రరావు, పాలపర్తి సతీష్, నీలాపు చిరంజీవిరెడ్డి, మండల యూత్ అధ్యక్షులు గుజ్జు గోవిందరెడ్డి, పెనుమత్స నాగేశ్వరరావు, తూము రాజాబాబు, పేపకాయల అప్పారావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహించడం నేరం


కోటవురట్లలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కోటవురట్ల: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గ అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో శనివారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమాన్ని అంగన్‌వాడీ అధికారులు నిర్వహించారు. బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, చట్టాలను వివరించారు. సూపర్‌వైజర్లు దుర్గ, హైమవతి మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు వివాహం చేయకూడదన్నారు. బాల్య వివాహం చేసుకుంటే పెళ్లి కుమారుడు, వారి తల్లిదండ్రులు, పెళ్లిలో పాల్గొన్న వారు, వారికి సహకరించిన వారికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా పడే అవకాశం ఉంటుందన్నారు. బాల్య వివాహాలు చేసుకోకుండా విద్యపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల బాలికలు ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవలసివస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఏసుదాసు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్తేరు రాణి, పద్మజ, పుష్పకుమారి, మంగ, ఫాతిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు


కె.గొట్టివాడలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి

కోటవురట్ల: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని పాయకరావుపేట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.గీతాంజలి కోరారు. మండలంలోని కోటవురట్ల, కె.గొట్టివాడ గ్రామాలలో శనివారం పర్యటించిన ఆమె పోలింగు కేంద్రాలు 31, 32, 33లను పరిశీలించారు. పరిసరాలు, గదులను పరిశీలించి సమస్యలపై తహసీల్దారు బి.వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. పోలింగు నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి పోలింగు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ముందుగా తమకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది నుంచి వసంత నవరాత్రులు నిర్వహించాలి


ఎల్లారమ్మ పేరంటాలకు పూజలు చేస్తున్న భక్తులు

అచ్యుతాపురం : శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది నుంచి శ్రీరామనవమి వరకూ దేవాలయాలలో వసంత నవరాత్రులు జరుపుకోవాలని సమరసతా సేవా ఫౌండేషన్ యలమంచిలి సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని కొండకర్లలో ఎల్లారమ్మ పేరంటాలు భక్తులు మాలలు ధరించి 41 రోజులు దీక్ష ఉగాదితో పూర్తి కానున్న నేపథ్యంలో అప్పారావు భక్తులతో మాట్లాడారు. నవరాత్రుల రోజు సాయంత్రం భజన, సామూహిక హారతి, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణం, సత్సంగం వంటి కార్యక్రమాలు రోజుకొకటి చొప్పున నిర్వహించాలని సూచించారు. శ్రీరామ నవమి రోజున శ్రీ సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ రమణ, నట్టే నర్సింగరావు, కోరిబిల్లి నారాయణరావు, పసుపులేటి కృష్ణారావు, గుడివాడ శేఖర్, నట్టే గాంధీ, ప్రసాద్, గోవింద్ పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి


స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

నక్కపల్లి: ఉపమాక వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల అనంతరం శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు క్యూలైన్లో వేచి ఉండీ బేడా మండపం చుట్టు ప్రదక్షిణ చేసి స్వామివారి ఉత్సవ మూర్తులను, క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామిని, ఆండాళ్లమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాలు ముగిసిన అనంతరం వారాంతపు సెలవులు రావడంతో యలమంచిలి, తుని అడ్డురోడ్డు, నర్సీపట్నం, ఆనకాపల్లి, తదితర ప్రాంతా లనుంచి వందలాది మంది తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ వారు ఏర్పాట్లు చేశారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


దివ్యాంగ చిన్నారుల అభ్యున్నతికి చేయూతనివ్వాలి

• డీఈవో వెంకటలక్ష్మమ్మ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

తుమ్మపాల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు కూడా సమాజంలో భాగమని, వారి అభ్యున్నతితోనే ఏ సమాజమైనా పురోగమిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఇందుకు క్షేత్రస్థాయిలో విద్యాశాఖ పరిపాలనాధికారులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వైద్యశాఖ, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ సమష్టిగా కృషి చేయాలని కోరారు. పాఠశాల స్థాయిలో సహిత విద్య కార్యకలాపాలపై జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్లో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగ చిన్నారుల కోసం ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అభియాన్ అనేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ వారికి చేయూతనిస్తోందన్నారు. ఇందులో భాగంగానే దివ్యాంగులు కూడా ఇతర చిన్నారులతో సమానంగా చదువుకునేలా పాఠశాల స్థాయిలో సహిత విద్యను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి చైల్డ్ ఇన్ఫో, యూ డైస్ ప్లస్‌లో నమోదు చేయడం ద్వారా వారికి అన్ని సేవలు అందించగలమన్నారు. విద్యాశాఖ, జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.శకుంతల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏపీవో వెంకటేశ్వరరావు, జిల్లా రిసోర్స్ పర్సన్‌లు బొడ్డు మహాలక్ష్మి నాయుడు, దేముడు బాబు, బి.వి.వరప్రసాద్, ప్రత్యేక ఉపాధ్యాయులు జగన్నాథనాయుడు, దేవుడునాయుడు, జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలను ఆదుకోవాలి


శరత్‌చందుకు చెక్కు అందజేస్తున్న సత్యవతి

అనకాపల్లి : మెదడు సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్న మార్టూరు గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త డి.వెంకటలక్ష్మికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్యం అందించి, ఆర్థికంగా ఆదుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆశ వర్కర్స్ అందించిన రూ.92 వేల నగదును వెంకటలక్ష్మి కుమారుడు శరత్‌చందుకు శనివారం చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ గ్రామాల్లో వైద్య సేవలందిస్తున్న ఆశ కార్యకర్తలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆశ వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.పార్వతి, కోశాధికారి సూర్యకళ, జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ప్రారంభం


పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభిస్తున్న గోపీనాథ్

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా పాలిటెక్నిక్ కోచింగ్ నిర్వహించడం అభినందనీయమని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ అన్నారు. పెద గుమ్ములూరు ఉన్నత పాఠశాలలో శనివారం ఉచిత కోచింగ్ సెంటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కోచింగ్ సెంటర్లు అందుబాటులో లేక చాలా మంది విద్యార్థులు పోటీ పరీక్షలకు వెళ్లలేక పోతున్నారన్నారు. వారికి ప్రత్యేక కోచింగ్ అవసరం ఉందన్నారు. అయితే ఈ ఏడాది ఎస్.రాయవరం మండలం పీఆర్‌టీయు ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సమన్వయకర్త సత్యనారాయణ, గుడివాడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగన్నదొర, చక్రవర్తి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పోలీసు శాఖలో 40 ఏళ్ల సేవలు అభినందనీయం



పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: పోలీసు శాఖలో ఉద్యోగంలో చేరడం అదృష్టంగా భావించాలని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ అన్నారు. పోలీసు ఉద్యోగం ఎంతో ఒత్తిడితో కూడుకున్నదే అయినా ప్రజలకు నేరుగా సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లా పోలీసు విభాగంలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఇద్దరు పోలీసు సిబ్బందికి ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఎస్పీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పదవీ విరమణ పొందిన ఏఆర్ ఎస్‌ఐ టి.అప్పారావు, చీడికాడ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ జి.ధనరాజులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో ప్రవేశించి సుమారు 40 సంవత్సరాల పాటు విశేష సేవలు అందించి ఏఆర్ ఎస్సైగా, హెచ్‌సీగా పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ పొందినా జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా వచ్చి కలవాలని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏవో బి.శారద, ఇన్‌స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, సతీష్ పాల్గొన్నారు.

మహిళలకు ముగిసిన కుట్టు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న దిశ ఎస్‌ఐ రాములమ్మ

తుమ్మపాల: మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని దిశ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రాములమ్మ ఆకాంక్షించారు. బవులువాడ పంచాయతీ దర్జీ కాలనీలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి, లుపిన్ ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లుపిన్ ఫార్మా కంపెనీ ప్రతినిధి రాజేష్ కేటీ, హెచ్‌ఆర్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందిస్తామన్నారు. రానున్న రోజుల్లో డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎస్వీడీఎస్ కార్యదర్శి జోగి నాయుడు మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడటానికి ఇలాంటి శిక్షణలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసిన 60 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ ముఖద్వార స్థాపన


ముఖద్వార స్థాపనలో పాల్గొన్న ఈవో, సిబ్బంది

అనకాపల్లి: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా శనివారం ముఖద్వార స్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో బండారు ప్రసాద్ మాట్లాడుతూ అమ్మవారి ముఖద్వార దర్శనాన్ని ఏప్రిల్ 22 నుంచి ప్రారంభిస్తామన్నారు. ఏప్రిల్ 7న కొత్త అమావాస్య సందర్భంగా జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో-కారు ఢీ.. 11 మందికి గాయాలు

అనకాపల్లి : ఆటోను కారు ఢీకొనడంతో 11 మందికి స్వల్పగాయాలు తగిలినట్లు ట్రాఫిక్ పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింగరావు కథనం మేరకు.. అనకాపల్లి నుంచి బుచ్చియ్యపేట మండలం దిమిలి గ్రామానికి వెళ్తున్న ఆటోలో ఎం.దుర్గాదేవి, వినయ్‌కుమార్, ఉమ, చంద్రతో పాటు మరో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరి ఆటో స్థానిక నర్సింగరావుపేట జీవీ కోటేశ్వరరావు వీధిలోకి రాగానే ఆటోను కారు ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ట

దేవరాపల్లి: జమ్మాదేవి పేట జంక్షన్‌లో శ్రీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని, అ త్యంత భక్తి శ్రద్ధ లతో పూజలు నిర్వహించారు. అ నంతరం ఆలయ ఆవరణలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

మునగపాక : ఇంటిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఈవోఆర్డీ వెంకటలక్ష్మి కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో అధికారులు దృష్టి సారించాలన్నారు. సీజన్‌లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ వంటి విషయాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ చార్జీల బకాయిలు చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. ప్రధానంగా ఇంటి పన్ను వసూళ్లు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలువురు కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

యలమంచిలి : నేడు ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ యలమంచిలి ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంతో పాటు విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు తెరిచి ఉంటాయని అనకాపల్లి ఈ ఈ రాజశేఖర్ శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు .విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాంబిల్లి: ఆదివారం కరెంట్ బిల్లులు వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

అనకాపల్లి: మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై పట్టణ సీఐ శంకరరావు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ తెలిపిన వివరాలివి.. ఒడిశాకు చెందిన బంగా హర్ష, కోటంకోట మండలం కొత్తపల్లి బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన కె.ప్రసాద్ బైక్‌పై మూడు ఫుల్ బాటిల్స్, రెండు బ్రీజర్స్ ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా స్థానిక మెయిన్ రోడ్డులో వాహనాల తనిఖీలో పట్టుబడ్డారని తెలిపారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్

అనకాపల్లి : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి కల్యాణి నర్సింగ్‌హోమ్ మేడపైన ఏప్రిల్ 1 నుంచి పౌర్ణమి సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 16 సంవత్సరాలుగా 12 మంది ఉపాధ్యాయులచే శిక్షణ ఇస్తున్నామన్నారు. ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు కోచింగ్ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన బీజేపీని ఓడించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీరామ్

అనకాపల్లి : ఉత్తరాంధ్ర జిల్లాలకు తీవ్ర అన్యాయం చేసిన బీజేపీని ఓడించాలని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 32 మంది ప్రాణత్యాగాలతో నిర్మించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అక్రమంగా అమ్మాలని ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు ఓటుహక్కుతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సీఎం రమేష్ ఏ రోజు ఏపీ గురించి మాట్లాడలేదన్నారు. పైగా ఫోర్జరీ సంతకాలతో బ్యాంకుల నుండి రూ.450 కోట్లు లూటీ చేసిన వ్యక్తికి అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తేలయ్యబాబు, బి.ఉమామహేశ్వరరావు, బుగిడి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.